


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 288 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 21 జూన్ 2026 వెల : 1/-రూ ॥
VOLUME :9 ISSUE :288 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 21 JUNE 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## చంద్రబాబు ఒక కర్మ యోగి.. ఆయనలా ప్రతీ సీఎం పనిచేయాలి

- ఉండవల్లిలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబుపై రాందేవ్ ప్రశంసలు
- చంద్రబాబును యోగి, కర్మ యోగిగా అభివర్ణించిన యోగా గురువు
- ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని కితాబు
- ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారిందన్న రాందేవ్
- చంద్రబాబులాగే ప్రతీ ముఖ్యమంత్రి పనిచేస్తే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్య

- మిగతా 2లో



## భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- విశాఖలోని ప్రోటిజెనిక్స్ ప్లాంట్‌ను సందర్శించిన పల్లా
- ఆరోగ్య రంగంలో సంస్థ సేవలు ఆదర్శనీయమని ప్రశంస
- ప్రోటిజెనిక్స్ స్ఫూర్తితో స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు
- సంస్థకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ

భారత ఆరోగ్య రంగ స్వావలంబనలో ప్రోటిజెనిక్స్ లైఫ్ సైన్సెస్ సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రశంసించారు. విదేశాల్లో ఉన్న తెలుగువారు ప్రోటిజెనిక్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం విశాఖలోని జీనోమ్ వ్యాలీలో ఉన్న ప్రోటిజెనిక్స్ ప్లాంట్‌ను ఆయన సందర్శించి, యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "అత్యవసరమైన ప్లాస్మా ఆధారిత ఔషధాల తయారీలో దేశీయ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రోటిజెనిక్స్ చేస్తున్న కృషి అభినందనీయం. ఆరోగ్య రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఇలాంటి సంస్థలే కీలకం" అని పేర్కొన్నారు. ప్లాస్మా ప్రోటీన్ థెరప్యూటిక్స్‌పై దృష్టి సారించిన

- మిగతా 2లో



## ఉండవల్లిలో 'యోగాంధ్ర' కార్యక్రమం..


- ఉండవల్లి గుహల వద్ద 'యోగాంధ్ర' కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, యోగా గురు రాందేవ్
- చంద్రబాబును కర్మయోగి అంటూ కొనియాడిన రాందేవ్
- మోదీ లక్ష్యాలకు సీఎం సహకారం అద్భుతమన్న యోగా గురు
- ఆసక్తిగా యోగాసనాలను తిలకించిన ముఖ్యమంత్రి

- మిగతా 2లో

# రైతులకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం

## అన్నదాత సుఖీభవ: రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు జమ చేసిన సీఎం చంద్రబాబు

- చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుట్లలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు విడుదల
- తొలి విడతగా ఒక్కో రైతుకు రూ.7 వేల చొప్పున ఆర్థిక సాయం
- కడప, కర్నూలులో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన
- వ్యవసాయ స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడిన ముఖ్యమంత్రి




**పెన్ పవర్ డెస్క్:** రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం కింద తొలి విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుట్ల వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లను జమ చేశారు. ఈ సాయంతో ప్రతి రైతు ఖాతాలో తొలి విడతగా రూ.7,000 జమ అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, అంతకుముందు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. రైతులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్లు, వర్మీ కంపోస్టు తయారీ, నూనె గింజల మిషన్ వంటి ప్రదర్శనల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఎం కిసాన్ పథకంపై ప్రధాని మోదీ ప్రసంగించిన కార్యక్రమాన్ని రైతులతో కలిసి సీఎం వీక్షించారు. ఇదే వేదిక నుంచి ముఖ్యమంత్రి 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కడప, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్లు 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభిస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.



## 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'..

- అర్ధాంగి భువనేశ్వరికి సీఎం చంద్రబాబు భావోద్వేగ బర్త్‌డే విషెస్
- భార్య, తల్లి, వ్యాపారవేత్తగా ఆమె మా జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడిన సీఎం
- భువనేశ్వరి దయ, కరుణ ఎందరికో ఆదర్శమని ప్రశంస
- నీలాంటి వ్యక్తి జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టమంటూ పోస్ట్


- మిగతా 2లో

## హార్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం - ఇరాన్



అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హార్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు

- మిగతా 2లో



## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు
- ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి దేశం నుంచి పంపిస్తామని స్పష్టీకరణ
- ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడుంటారని ఉద్ఘాటన

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని

- మిగతా 2లో

## రూ.10 లక్షల కోట్ల అప్పు..

### విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

- ఆర్థికవేత్తలు, నిపుణులతో సంప్రదింపుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లు దాటాయని శ్వేతపత్రంలో వెల్లడి
- 2031 నాటికి పని చేసే వయసు జనాభా తగ్గనుందని, ఇప్పుడే చర్యలు తీసుకోవాలని హెచ్చరిక

- మిగతా 2లో



## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

- కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ముద్రగడ
- ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు
- కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన జగన్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ అధినేత
- రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చామన్న కుటుంబ సభ్యులు

- మిగతా 2లో



## 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!



- ఇరాన్‌తో ఒప్పందం విషయంలో గందరగోళం
- అమెరికా తరహాలో పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదన్న వాన్స్
- అందుకే ఒప్పంద వివరాలు త్వరగా వెల్లడి కాలేదని వ్యాఖ్య
- ఒప్పందం కుదర్చడం తమ ఘనతగా చెప్పుకొంటున్న పాక్
- వాన్స్ వ్యాఖ్యలతో పాక్‌కు ఇబ్బందికర పరిస్థితి

- మిగతా 2లో

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం



ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను

- మిగతా 2లో

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి
- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్
- హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారా? ఈ ప్రచారంలో నిజమెంత?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కాంగ్రెస్ తో జత కడుతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఇటీవల మీడియా సమావేశంలో ఆయన చేసిన కాక్రోచ్ వ్యాఖ్యలతో ఆయన కాంగ్రెస్ కు మరింత చేరువయ్యారని, బీజేపీకి దూరమవుతున్నారన్న కక్యాంపెయిన్ సోషల్ మీడియాలో నడుస్తుంది. అంతకు ముందు నుంచే ఈ ప్రచారం జరుగుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని సోషల్ మీడియాలో హోరెత్తిపోతుంది. బెంగళూరులో తన నివాసంలో ఉంటున్న జగన్ డీకే శివకుమార్ తో భేటీ అయ్యారన్న వార్తలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి.

**కర్ణాటక నుంచి...**

బీజేపీ పై దేశ వ్యాప్తంగా ఎదురవుతున్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని, అందుకే కర్ణాటక నుంచి వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కకుండా చేయడం వెనక కూడా జగన్ ఉన్నారంటూ మరొక ప్రచారం కూడా జరిగింది. తాజాగా ఏపీలో తాము కాక్రోచ్ లుగా మారుతామని జగన్ చేసిన వ్యాఖ్యలను తీసుకుని ఆయనను హస్తం పార్టీకి దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇందులో నిజానిజాలు పరిశీలిస్తే... జగన్ కాంగ్రెస్ తో జత కట్టడానికి అసలు ఇష్టపడరు. ఎందుకంటే 2012లో పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. అప్పటి నుంచి జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వస్తున్నారు. ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ తో కలవకుండానే ఎన్నికల్లో పోటీ చేస్తూ తన పార్టీకి ప్రత్యేక ఓటు బ్యాంకును సంపాదించుకున్నారు.

**ఏపీ రాజకీయాలకే...**

జగన్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకే పరిమితమవుతారు. ఆయన తెలంగాణ వైపు కూడా చూడరు. అలాంటింది రాష్ట్ర విభజనకు కారణమయిన కాంగ్రెస్ తో ఎందుకు జట్టు కడతారు? అన్న ప్రశ్నకు ప్రచారం చేసే వారి నుంచి సమాధానం ఉండదు. అందులోనూ వైసీపీ ఓటు బ్యాంకు అంతా కాంగ్రెస్ నుంచి వచ్చిందే. మళ్లీ కాంగ్రెస్ తో కలిస్తే తాను రెండు దశాబ్దాలుగా ఏర్పరచుకున్న ఓటు బ్యాంకును తిరిగి కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపే చేసే చర్యలకు అస్సలు దిగరన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. బీజేపీ ఇప్పుడు కేంద్రంలో బలంగా ఉంది. ప్రాంతీయ పార్టీల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తుంది. జగన్ బీజేపీకి రహస్య మిత్రుడు. బలమైన బీజేపీని కాదని, కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునేంత రాంగ్ స్టెప్ ను రాజకీయంగా జగన్ వేయరన్నది కూడా అంతే వాస్తవం. అందుకే జగన్ వచ్చే ఎన్నికల్లోనూ ఒంటిరిగానే పోటీ చేస్తారు. ఒకవేళ ఎన్నికల అనంతరం పొత్తు ఇవ్వాల్సి వస్తే బీజేపీతో చేతులు కలుపుతారు కాని, తనను పధ్నాలుగు నెలల పాటు జైల్లో ఉంచిన కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతివ్వరన్నది వాస్తవం.

# భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- మొదటి పేజి తరువాయి

ఏపీలోని తొలి సంస్థ ఇదేనని ఆయన గుర్తుచేశారు. 2021లో ఎన్నారై వైద్యుల బృందం స్థాపించిన ఈ సంస్థ.. ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబులిన్ (×ఎ×+), హ్యూమన్ ఆల్బుమిన్, ఫ్యాక్టర్ ఎ××× వంటి కీలక ఉత్పత్తులను అభివృద్ధి చేస్తోంది. రోగనిరోధక లోపాలు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, రక్తస్రావ సమస్యల చికిత్సలో ఈ ఔషధాలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రోటిజెనిక్స్ సంస్థను ఆదర్శంగా తీసుకుని ఎన్నారైలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పల్లా కోరారు. విశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని, ప్రజల ఆరోగ్య భద్రతకు తోడ్పడే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# చంద్రబాబు ఒక కర్మ యోగి.. ఆయనలా ప్రతీ సీఎం పనిచేయాలి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక యోగి, కర్మ యోగి అని, ఆయనలా దేశంలోని ప్రతి ముఖ్యమంత్రి పనిచేస్తే 'వికసిత్ భారత్' లక్ష్యం 2047 కంటే ముందే సాకారం అవుతుందని యోగా గురువు బాబా రాందేవ్ ప్రశంసించారు. శనివారం ఉండవల్లిలోని ప్రజావేదిక వద్ద 'యోగాంధ్ర' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు సైతం ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని, రాందేవ్ బాబా నిర్వహించిన యోగసాధనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. "సీఎం చంద్రబాబు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు, కానీ నేను యోగా అతిథిగా వచ్చాను. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, చురుకుగా ఉండటం స్ఫూర్తిదాయకం. చంద్రబాబు అభివృద్ధి, దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి" అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్', 'ఏక్ భారత్-శ్రేష్ట్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని చేస్తున్న కృషికి చంద్రబాబు తోడుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంపై కూడా రాందేవ్ బాబా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారింది. ఈ రాజధానిని పచ్చదనంతో, అద్భుతమైన అందాలతో తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం స్విట్జర్లాండ్‌ను తలపిస్తోంది" అని కితాబిచ్చారు. అంతకుముందు ఉండవల్లి గుహల్లో కొలువైన పద్మనాభ స్వామిని దర్శించుకున్నానని, ఇక్కడి అరటి, మామిడి పండ్లు చాలా రుచిగా ఉన్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. చంద్రబాబు ప్రకృతి ప్రేమికుడు, సాంస్కృతిక ప్రేమికుడు, యోగా ప్రేమికుడు, సర్వజన ప్రేమికుడు అని అభివర్ణించారు.

ఈ కార్యక్రమంలో రాందేవ్ బాబా తన శిష్యులతో కలిసి యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!

అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం విషయంలో పాకిస్థాన్‌కు మరోసారి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఇస్లామాబాద్‌ను ఇరకాటంలోకి నెట్టాయి. ఒప్పంద వివరాల విడుదల ఆలస్యంపై స్పందించిన ఆయన పాకిస్థాన్‌లో అమెరికా తరహా పత్రికా స్వేచ్ఛ లేదని వ్యాఖ్యానించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన వాన్స్ అమెరికాలో ఒప్పందాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలనే అంచనాలు ఉంటాయని చెప్పారు. కానీ పాకిస్థాన్, ఖతార్ వ్యవస్థల్లో అలాంటి సంప్రదాయం లేదని వ్యాఖ్యానించారు. అందుకే ఇరాన్‌తో ఒప్పంద వివరాలు విడుదల చేసే విషయంలో కొంత గందరగోళం ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో పాకిస్థాన్ 180 దేశాల్లో 153వ స్థానంలో ఉంది. అక్కడ జర్నలిస్టుల స్వేచ్ఛపై అంతర్జాతీయ సంస్థలు గతంలోనూ ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని తమ దౌత్య విజయంగా పాకిస్థాన్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అయితే స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన సంతకాల కార్యక్రమం రద్దు కావడం కూడా పాకిస్థాన్‌కు ఇబ్బందిగా మారింది. చివరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ డిజిటల్ పద్ధతిలో ఒప్పందంపై సంతకాలు చేశారు.

# భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.

## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత..

## హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఇరు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు.

గత కొన్ని రోజులుగా ముద్రగడ పద్మనాభం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య సమస్యలు కాస్త ఎక్కువవడంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్ తీసుకొచ్చి ఆసుపత్రిలో జాయిన్ చేశారు. గత రెండు రోజులుగా వైద్యులు ఆయనకు డయాలసిస్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని చికిత్స అందిస్తున్న డాక్టర్ల టీమ్ అధికారికంగా వెల్లడించింది. ముద్రగడ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వైసీపీ అధినేత జగన్... ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా ఆరా తీశారు. ముద్రగడ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన జగన్... ఆయన అత్యంత త్వరగా, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు, ముద్రగడ ఆసుపత్రిలో చేరారనే వార్త బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షురూ అయ్యాయి. దీంతో ఆయన ఆరోగ్యంపై కాపు శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, ముద్రగడ కుటుంబ సభ్యులు వెంటనే స్పందిస్తూ ఆందోళనలకు చెక్ పెట్టారు. "ఆయన క్షేమంగా ఉన్నారు. కేవలం రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చాం. దయచేసి ఇంటర్నెట్‌లో వచ్చే ఎలాంటి అవాస్తవాలను, తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు" అని విజ్ఞప్తి చేశారు.

# రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు

హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

# రూ.10 లక్షల కోట్ల అప్పు..

## విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

తమిళనాడు రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేయాలని 'వుయ్ ది లీడర్' వ్యవస్థాపకుడు కె. అన్నామలై రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఇటీవలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన నేపథ్యంలో అన్నామలై ఈ ప్రతిపాదన చేశారు. ప్రభుత్వం జూన్ 16న విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, తమిళనాడు ప్రత్యక్ష అప్పులు దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలను కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రం మొత్తం అప్పు రూ.13.18 లక్షల కోట్లుగా ఉంది. రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో 22.8 శాతం కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చిస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగానికి ఈ శ్వేతపత్రం ఒక 'పోస్ట్‌మార్టమ్' లాంటిదని జూన్ 19న అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ నివేదికను కేవలం ఒక సాకుగా చూపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని, తక్షణ దిద్దుబాటు చర్యల చేపట్టేందుకు దీనిని ఒక మార్గసూచిగా పరిగణించాలని ఆయన హితవు పలికారు. 2031 నాటికి తమిళనాడులో పనిచేసే వయసున్న జనాభా క్రమంగా తగ్గనుందని, ఇది అత్యంత ఆందోళనకరమైన విషయమని అన్నామలై హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకోవడానికి, అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వానికి గడువు చాలా తక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు జూఎెఎఱఅఝఅ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

# హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (×=+జ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

# ఉండవల్లిలో 'యోగాంధ్ర' కార్యక్రమం..

యోగా గురు బాబా రాందేవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు ఒక కర్మయోగి అని అభివర్ణించారు. అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద శనివారం 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా రాందేవ్ యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షలైన 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు అందిస్తున్న సహకారం అమోఘమని కితాబిచ్చారు. ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. అంతకుముందు పతంజలి యోగా గురుకులం విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో యోగాకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, యోగా అభిమానులు పాల్గొన్నారు.

# 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అర్ధాంగి నారా భువనేశ్వరికి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. భువనేశ్వరిని తన జీవితంలో వెలుగుగా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు.

"భార్యగా, తల్లిగా, వ్యాపారవేత్తగా మా అందరి జీవితాల్లో వెలుగు నింపే భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "నీ దయ, కరుణ, సానుకూల దృక్పథం ఎందరికో స్ఫూర్తినిచ్చాయి. నీ ఔదార్యంతో ఇతరులను ఉన్నత స్థానంలో నిలబెడతావు. నువ్వు చేపట్టే ప్రతి పాత్రకు అందాన్ని, ప్రయోజనాన్ని చేకూరుస్తావు" అని కొనియాడారు. "నీలాంటి అద్భుతమైన వ్యక్తి నా జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టం. నీ బలం, ఆప్యాయత, మరెన్నో విధాలుగా నువ్వు ప్రతిరోజూ మా జీవితాలను ప్రకాశవంతం చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ ఏడాది నీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: డీఆర్ఓ తిప్పేనాయక్

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 20:** స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం విస్తృత స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి డా. టి. తిప్పేనాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ, వికాస సంస్థ అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణ, కార్యాలయ పరిసరాలు, రహదారులను శుభ్రపరిచి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డీఆర్ఓ తిప్పేనాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం జిల్లా వ్యాప్తంగా స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల "ప్లాస్టిక్ ఫ్రీ గవర్నెన్స్ అండ్ మార్కెట్స్" అనే అంశంతో కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే నష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. అనంతరం డీఆర్ఓ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి, అధికారులు, సిబ్బందితో కలిసి స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




## పదోన్నతిపై బదిలీ అయిన పంచాయతీ అభివృద్ధి అధికారులకు ఘన సన్మానం

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 20:** కాజులూరు మండలం నుంచి పదోన్నతులపై ఇతర మండలాలకు బదిలీ అయిన పంచాయతీ అభివృద్ధి అధికారులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదోన్నతులు పొందిన అధికారులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.పదోన్నతిపై బదిలీ అయిన అధికారుల్లో ఎం.ఎస్. శ్రీనివాసరావు (మంజేరు), రాజకుమార్ (కుయ్యేరు), శివకుమార్ (శలపాక), సుధారాణి (పెనుమళ్ల), రవికుమార్ (బంధనపూడి), పి. పద్మ (తనుమళ్ల), వి.లహరిక (ఉప్పుమిల్లి), మేరీకుమారి (మతుకుమిల్లి), రవికుమార్ (తణుకువాడ), మధుమోహన్ (అయితపూడి), హేమాదేవి (శీల) ఉన్నారు.ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ, కాజులూరు మండలంలో విధులు నిర్వహించిన సమయంలో అధికారులు ప్రజలకు అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. వారి సేవలను గుర్తు చేసుకుంటూ, కొత్తగా వెళ్లే మండలాల్లో కూడా అదే నిబద్ధత, కర్తవ్యదీక్షతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.సన్మానిత అధికారులు తమకు అందించిన సహకారానికి మండల పరిపాలన యంత్రాంగానికి, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కాజులూరు మండలంలో పనిచేసిన అనుభవాలు తమకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఆర్. పద్మలత, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామపంచాయతీల పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొని పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.



## విద్యను వ్యాపారంగా మార్చితే కఠిన చర్యలు

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

- స్కూల్ ఫీజుల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలి
- మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, పెన్ పవర్,జూన్ 20:** విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని ప్రభుత్వం ఏమాత్రం సహించదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రామచంద్రపురంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, జిల్లా విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావుతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.ఇటీవల ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయంటూ ప్రజల నుంచి, సామాజిక మాధ్యమాల ద్వారా అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల తమ ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, పాఠశాలలో పనిచేసే సిబ్బంది వివరాలు, వారి విద్యార్హతలను కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని గుర్తు చేశారు.పాఠశాలల ప్రాంగణంలో యూనిఫాంలు, పుస్తకాలు విక్రయించరాదని స్పష్టం చేసిన మంత్రి, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులపై అదనపు భారం మోపకుండా విద్య అందించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో 'నో అడ్మిషన్స్' బోర్డులు కనిపించడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జీవో నెం.1 ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమతుల సమయంలో సమర్పించిన ప్రమాణాలను అమలు చేయాలని, ప్రతి సంవత్సరం శానిటరీ సర్టిఫికేట్, స్ట్రక్చరల్ సేఫ్టీ సర్టిఫికేట్, ఫైర్ ఎన్‌ఓసీ, మౌలిక వసతులు, ఫీజుల వసూళ్లకు సంబంధించిన ఆడిట్ నివేదికలను సమర్పించాలని తెలిపారు.ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించడం తప్పనిసరి అని, ఎక్కడైనా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ తాము ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఫీజులు వసూలు చేస్తున్నామని, అవసరమైతే విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించవచ్చని తెలిపారు. అలాగే విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమావేశంలో డీవైఈవో పి. రామలక్ష్మణమూర్తి, ఎంఈవోలు ఎం. శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, నాగరాజు, రామచంద్రపురం జోనల్ ప్రైవేట్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జీవీ రావు, జిల్లా అధ్యక్షులు డి. సత్తిబాబు, గుబ్బల రాంబాబు, బి.ఏ.ఎస్. సరోజిని, రాజ్యలక్ష్మి, నియోజకవర్గంలోని ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# అన్నవరం దేవస్థానంలో క్రమశిక్షణా చర్యలపై ట్రస్టు బోర్డు జోక్యం చట్టబద్ధమేనా? భక్తుల్లో కొత్త సందేహాలు

**అన్నవరం దేవస్థానంలో ఒక పురోహితుడిపై గతంలో తీసుకున్న క్రమశిక్షణా చర్యలను సడలించాలంటూ వచ్చిన వినతి ఇప్పుడు దేవాదాయ శాఖ అధికారాలు, ట్రస్టు బోర్డు పరిధి, చట్టబద్ధతపై కొత్త చర్చకు దారి తీసింది. కమిషనర్ లేదా ఎగ్జిక్యూటివ్ అధికారుల నిర్ణయాలను ట్రస్టు బోర్డు మార్చగలదా అనే ప్రశ్న భక్తులు, న్యాయ నిపుణుల మధ్య ఆసక్తికర చర్చగా మారింది.**

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ ,కాకినాడ / అన్నవరం , జూన్ 20:**కాకినాడ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఇటీవల చోటుచేసుకున్న ఒక పరిపాలనా అంశం ఇప్పుడు భక్తులు, న్యాయ నిపుణులు, దేవాదాయ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఒక పురోహితుడిపై గతంలో తీసుకున్న క్రమశిక్షణా చర్యలను సడలించాలని కోరుతూ పాలక మండలి సమావేశంలో వినతి సమర్పించబడినట్లు సమాచారం వెలుగులోకి రావడంతో అధికార పరిధులపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన దేవాలయాల్లో పాలక మండళ్లను ఏర్పాటు చేస్తుంది. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆర్థిక నిర్వహణ, నిర్మాణ పనులు వంటి అంశాలపై పాలక మండళ్లు సూచనలు చేస్తాయి. ఆ ప్రతిపాదనలు అజెండాలో చేర్చి తీర్మానాల రూపంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతికి పంపడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

అయితే అన్నవరం దేవస్థానంలో తాజాగా వెలుగులోకి వచ్చిన వ్యవహారం ఈ వ్యవస్థకు భిన్నంగా ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మల్లాది గురుమూర్తి అనే పురోహితుడిపై గతంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, భక్తుల పట్ల అనుచిత ప్రవర్తన వంటి ఆరోపణల నేపథ్యంలో శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు రికార్డులు సూచిస్తున్నాయి. అనంతరం వివరణను పరిశీలించిన అధికారులు కొన్ని షరతులతో విధుల్లో కొనసాగేందుకు అనుమతించినప్పటికీ, భవిష్యత్తులో తప్పిదాలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది.

అలాగే గతంలో భక్తుల నుంచి దానాల సేకరణ విషయంలో వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వార్షిక ఇంక్రిమెంట్ల నిలుపుదల వంటి క్రమశిక్షణా చర్యలు కూడా అమలైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సంబంధిత పురోహితుడు తనపై విధించిన శిక్షలను సడలించాలని కోరుతూ ఇటీవల పాలక మండలి సమావేశంలో అభ్యర్థించినట్లు తెలిసింది.

ఇక్కడే ప్రధాన ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దేవాదాయ శాఖ కమిషనర్, జాయింట్ కమిషనర్ లేదా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పరిధిలో తీసుకున్న క్రమశిక్షణా చర్యలను ట్రస్టు బోర్డు పునఃసమీక్షించే అధికారం కలిగి ఉందా? లేక అలాంటి అంశాలు పూర్తిగా దేవాదాయ శాఖ సేవా నియమావళి పరిధిలోనే కొనసాగాలా?

దేవాదాయ శాఖ ఉత్తర్వులు ఞూ2/5926/2011 (28-05-2011), ఞూ2/5926/2009 (20-04-2012) ప్రకారం పురోహితులు మరియు ఇతర ఉద్యోగులపై సస్పెన్షన్, తొలగింపు, క్రమశిక్షణా చర్యల విషయంలో కార్యనిర్వహణాధికారికి స్పష్టమైన అధికారాలు ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ట్రస్టు బోర్డుకు అప్పీల్ అధికారం కల్పించినట్లు స్పష్టమైన ప్రస్తావన కనిపించకపోవడం ఇప్పుడు చర్చకు కేంద్రబిందువుగా మారింది.

న్యాయ వర్గాల అభిప్రాయం ప్రకారం ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు, అప్పీలు, రివిజన్లు వంటి అంశాలకు చట్టం నిర్దేశించిన అధికార వ్యవస్థ ఉంటుంది. ఒకసారి సంబంధిత అధికారి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత వాటిని మార్చడం లేదా సవరించడం సాధారణంగా అదే చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే జరగాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

అయితే పాలక మండలి ముందు వినతిపత్రం సమర్పించడం తప్పు కాదని, కానీ తుది నిర్ణయం తీసుకునే అధికారం ఎవరికుందన్నది చట్టపరమైన అంశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ట్రస్టు బోర్డు అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చేమో గానీ, తుది ఆదేశాలు ఇవ్వడం మాత్రం సంబంధిత అధికారుల పరిధిలోనే ఉండవచ్చని చెబుతున్నారు.

అన్నవరం వంటి రాష్ట్ర ప్రఖ్యాత దేవస్థానంలో ఈ అంశం ముందుకు రావడం భక్తుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కమిషనర్ స్థాయి ఉత్తర్వులపై ట్రస్టు బోర్డు ఎంతవరకు జోక్యం చేసుకోగలదనే అంశంపై దేవాదాయ శాఖ అధికారిక స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఈ వ్యవహారంలో పాలక మండలి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అసలు అలాంటి నిర్ణయం తీసుకునే అధికారం బోర్డుకు ఉందా? లేక ఇది పూర్తిగా దేవాదాయ శాఖ పరిపాలనా వ్యవస్థ పరిధిలోనే కొనసాగే అంశమా? అన్న ప్రశ్నలకు సమాధానం కోసం ఇప్పుడు భక్తులు, దేవాదాయ శాఖ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## ఆర్థిక సమగ్రతకు బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలి : ఎల్డీఎం సి.హెచ్.వి. ప్రసాద్..

పెద్దాపురంలో జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం...






**శంఖవరం /పెద్దపురం పెన్ పవర్ జూన్ 20:-**
కాకినాడ జిల్లా పెద్దాపురం మండల అభివృద్ధి కార్యాలయంలో జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం శనివారం లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్డీఎం) సి.హెచ్.వి. ప్రసాద్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్డీఎం ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ఆర్థిక సేవలు అందేలా బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమావేశానికి నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ వై. సోమునాయుడు, సిడ్బి ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ఎ. రామకృష్ణ, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎల్డీఎం సి.హెచ్.వి. ప్రసాద్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ ఖాతాల నిర్వహణపై సమీక్ష నిర్వహించి, ఖాతాదారుల నిధుల భద్రతకు బ్యాంకులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.

ఎంఎస్ఎంఈ రంగం దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముక వంటిదని పేర్కొన్న ప్రసాద్, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే పథకాల అమలుపై దృష్టి సారించాలని కోరారు.

అదేవిధంగా ఖాతాదారుల కేవైసీ వివరాల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ఎల్డీఎం ప్రసాద్ స్పష్టం చేశారు. కేవైసీ పూర్తి చేయడం ద్వారా ఖాతాదారుల ఖాతాలకు మరింత భద్రత లభిస్తుందని తెలిపారు.

జిల్లాలో ఆర్థిక సమగ్రత లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు, అభివృద్ధి సంస్థలు పరస్పర సహకారంతో పనిచేయాలని ఎల్డీఎం సి.హెచ్.వి. ప్రసాద్ పిలుపు నిచ్చారు.

## ఆత్రేయపురంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లు





**ఆత్రేయపురం, పెన్ పవర్: జూన్ 20:** అంతర్జాతీయ యోగా దినోత్సవం (యోగాంధ్ర కార్యక్రమం) విజయవంతం చేసేందుకు ఆత్రేయపురం మండల యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షతన మండలంలోని పీఈటీలు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిధిలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుందని తెలిపారు. విద్యార్థులు, ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కార్యక్రమానికి సంబంధించి విద్యార్థుల భాగస్వామ్యం, అవసరమైన ఏర్పాట్లు, నిర్వహణ అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి పి.వి. ప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓలు కే. రమేష్ బాబు, పి.వి.ఆర్.కె. రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్, మండల పరిషత్ సిబ్బంది, వివిధ పాఠశాలల పీఈటీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హైస్కూల్ విద్యార్థులకు డైరీల అందజేత

దాత సహకారంతో 250 మంది విద్యార్థులకు పంపిణీ



**రావులపాలెం, పెన్ పవర్: జూన్ 20:**మండల పరిధిలోని రావులపాడు జడ్పీ హైస్కూల్‌లో గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, దాత పెచ్చేటి చిన్నారావు రూ.25 వేల విలువైన 250 స్టూడెంట్ డైరీలను విద్యార్థులకు అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా డైరీలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, స్టూడెంట్ డైరీ ద్వారా విద్యార్థులు రోజువారీ హోంవర్క్‌ను అదే రోజు పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ డైరీ విధానం ప్రవేశపెట్టడం వినూత్నమని, ఇది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో మరింత బాధ్యతను పెంచడంతో పాటు ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా దాత పెచ్చేటి చిన్నారావును అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదనరావు, మాజీ సర్పంచ్ బాబ్జి, గెడ్డం శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె.వి. శేఖర్, జి. సునీత, సత్యవతి, ఆంజనేయులు, శ్యామల, వీరవేణి, మేరీ జాన్స్, వసుంధర, వెంకటలక్ష్మి, సుజాత, గోపాలకృష్ణ, మేక సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## రోజూ చేసే యోగాభ్యాసం ఆరోగ్యానికి వరం



**కాకినాడ, పెన్ పవర్, జూన్ 20:**రాజరాజేశ్వరి ఐటీఐ ఆవరణలో డా. అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి యోగాభ్యాసం నిర్వహించి, యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగా అనేది శరీరం, మనస్సు, శ్వాసను సమన్వయం చేసే అద్భుతమైన ప్రక్రియ అని అన్నారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడి, రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉండటంతో గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని తెలిపారు. పశ్చిమోత్తానాసనం, వజ్రాసనం వంటి ఆసనాలు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయని, సూర్య నమస్కారాలు, క్రియాయోగా వంటి సాధనలు శరీరంలోని జీవక్రియలను చురుకుగా మార్చి అదనపు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయని చెప్పారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీరంలోని వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్లి రోగనిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. యోగా, ధ్యానం వల్ల ఒత్తిడి హార్మోన్‌గా పిలిచే కార్టిసాల్ స్థాయిలు తగ్గి మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, శ్వాసపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరిగి జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపడతాయని వివరించారు. రాత్రి నిద్రకు ముందు సుఖాసనం లేదా యోగనిద్ర చేయడం వల్ల నాడీ వ్యవస్థ ప్రశాంతమై నిద్రలేమి సమస్యలు దూరమవుతాయని తెలిపారు. ప్రాణాయామం ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుతుందని, కపాలభాతి వంటి సాధనలు పొట్ట భాగంలోని కొవ్వును తగ్గించడంలో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల గణేష్, తారక్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, విజయ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానానికి రూ.2.40 లక్షల ఆదాయం



**కొత్తపేట,పెన్ పవర్,జూన్ 20:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు, విరాళాల ద్వారా రూ.2,40,730 ఆదాయం సమకూరింది. దేవస్థానం వివరాల ప్రకారం ముఖమండప సేవల ద్వారా రూ.7,000, ఏకాదశ రుద్ర తైలాభిషేకాల ద్వారా రూ.36,000, మహాన్యాస పూర్వక తైలాభిషేకాల ద్వారా రూ.36,925, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.16,480, తిలదానం ద్వారా రూ.150, స్వయం హోమం ద్వారా రూ.1,600 ఆదాయం లభించింది. వీటి ద్వారా మొత్తం రూ.98,155 సమకూరింది. అదనంగా ఫోన్‌పే ద్వారా రూ.19,435, పరోక్ష పూజల ద్వారా రూ.1,01,700, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.21,440 లభించాయి. దీంతో శనివారం ఒక్కరోజే మొత్తం రూ.2,40,730 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. శ్రీ స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## ఈనెల 30న జగ్గంపేటలో మెగా జాబ్ మేళా



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 20:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచే లక్ష్యంతో ఈనెల 30న జగ్గంపేట నియోజకవర్గం సంబంధించి జగ్గంపేటలో ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం జాబ్ మేళా మొబిలైజేషన్ పోస్టర్‌ను జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు నైపుణ్యం పోర్టల్ ద్వారా ముందుగా నమోదు చేసుకోవాలి. ఇందుకోసం ప్రకటనలో ఇచ్చిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు నమోదు చేయవచ్చు. మరిన్ని వివరాలకు 9490175415, 8688977277 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ బాబు, ఆర్యవైశ్య రాష్ట్ర డైరెక్టర్ కొత్త కొండబాబు, నాయకంపల్లి సొసైటీ చైర్మన్ పాలకుర్తి ఆదినారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.చిన్నారావు, పి వి వి సత్యనారాయణ, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఐ.టి.విభాగంలో ముగిసిన వర్క్‌షాప్



**గండేపల్లి,పెన్ పవర్,జూన్,20:** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య విశ్వవిద్యాలయం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం 'ఏఐ టూల్స్ బై కేపీఎంజీ' విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్‌గా కుల్దీప్ తివారి, ఆయుష్మాన్ ఘోష్ మరియు ఓంకార్ జగ్తాప్ పాల్గొని అధ్యాపకులకు ఆధునిక కృత్రిమ మేధస్సు సాధనాలపై సమగ్ర అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెమినీ ఏఐ , ప్రాంప్ట్ ఇంజినీరింగ్, మల్టీ ఏజెంట్ వర్క్‌ఫ్లోలు, కంటెంట్ సృష్టి, పరిశోధన, బోధనలో ఏఐ వినియోగం, ఆటోమేషన్ మరియు ఉత్పాదకత పెంపు వంటి అనేక ఆధునిక అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు. అధ్యాపకులు వివిధ ఏఐ సాధనాలను ప్రత్యక్షంగా ఉపయోగించి వాటి ప్రయోజనాలను తెలుసుకున్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఏఐ సాంకేతిక ప్రాధాన్యత, బోధన-అభ్యాస ప్రక్రియలో వాటి సమర్థవంతమైన వినియోగం, పరిశోధనలో కొత్త అవకాశాల గురించి నిపుణులు విస్తృతంగా వివరించారు. శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, ఏఐ ఆధారిత బోధనా విధానాలను తమ తరగతుల్లో అమలు చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విశ్వవిద్యాలయానికి చెందిన సుమారు 200 మంది అధ్యాపకులు పాల్గొని శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమం అధ్యాపకుల్లో కృత్రిమ మేధస్సు సాంకేతికతల పట్ల అవగాహనను పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తులో విద్యా రంగంలో ఏఐ వినియోగానికి కొత్త దారులను చూపిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఐ వీరాంజనేయులు, మిస్టర్ వి సతీష్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్ రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్, సైన్సెస్) డాక్టర్ ఎ రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, అసోసియేట్ డీన్ (స్కూల్ అఫ్ కంప్యూటింగ్) డాక్టర్ ఎం వి రాజేష్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు, డిప్యూటీ హెడ్స్ డాక్టర్ ఏ లక్ష్మణ రావు, మిస్ యస్ నీలిమ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్రకు విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు



**చెత్త నుంచి సంపద సృష్టిద్దాం**
**మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం, పెన్ పవర్,జూన్ 20:** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర --స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్లుగా మారి సమాజంలో చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు. రామచంద్రపురం పట్టణంలోని శ్రీ వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. "పర్యావరణాన్ని కాపాడుదాం.. అది మనల్ని రక్షిస్తుంది" అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, చెత్తను వర్గీకరించడం, పునర్వినియోగం చేయడం ద్వారా చెత్తనే సంపదగా మార్చుకోవచ్చని తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ గ్రామాలు--స్వచ్ఛ నగరాల లక్ష్యంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పరిశుభ్రతపై సమాజానికి ఆదర్శంగా నిలవడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థుల్లో పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు ప్రభుత్వం "ముస్తాబు" కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంతో పాటు సామాజిక బాధ్యతలను కూడా బోధించాలని మంత్రి సూచించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకుని పర్యావరణ పరిరక్షణ,పరిశుభ్రత, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అక్కల అశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, శ్రీ వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ కరస్పాండెంట్ బి.ఏ.ఎస్. సరోజిని మాట్లాడుతూ స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర లక్ష్యాలు, విద్యార్థులు పాటించాల్సిన పరిశుభ్రత ప్రమాణాలపై వివరించారు. అనంతరం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కమ్మవారి సావరంలోని అంగన్వాడీ కేంద్రాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం,ఇతర సేవలపై ఆరా తీశారు. అంగన్వాడీ టీచర్ భారతి, సూపర్వైజర్లు నాగమణి, పార్వతి మంత్రికి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో మంత్రి కొద్దిసేపు ముచ్చటించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలుష, ప్రిన్సిపాల్ నవీన్ తేజ,ఎంఈవో వాసంశెట్టి నాగేశ్వరి,కూటమి పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి







- **తెలియని వారితో స్నేహాలు వద్దు**
- **ఎస్సై ఆంజనేయులు**

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 20:** యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో స్నేహాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ జిల్లా ఈగల్ టీం ఇన్‌చార్జ్ ఎస్సై ఆంజనేయులు సూచించారు. స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో,కాకినాడ జిల్లా ఈగల్ యాంటీ-నార్కోటిక్స్ విభాగం, నశా ముక్త్ భారత్ అభియాన్ సంయుక్తంగా నిర్వహించిన మాదకద్రవ్యాల నియంత్రణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధీర ప్రసాద్, జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన చట్టాలు,వాటి వల్ల ఎదురయ్యే న్యాయపరమైన శిక్షలపై అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులతో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఆశలు చూపించి మోసగించే వారిని నమ్మవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వాసుపత్రి మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కాటన్ మాట్లాడుతూ యువతనే లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల వ్యాపారం జరుగుతోందని,విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబ వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. "డ్రగ్స్ వద్దు బ్రో -- ఆరోగ్యం ముద్దు బ్రో" అనే నినాదాలతో కళాశాల ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్,ఈగల్ టీం, నశా ముక్త్ భారత్ అభియాన్ విభాగాలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అభినందించారు. కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యుడు ధర్మతేజ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి.తేజేశ్వరరావు, డి. అశ్విని,నశా ముక్త్ భారత్ అభియాన్ సభ్యులు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **ప్రజా దర్బార్‌లో 52 వినతులు**
- **మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, పెన్ పవర్,జూన్ 20:** ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలపై మొత్తం 52 వినతిపత్రాలను మంత్రికి అందజేశారు. ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించిన మంత్రి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను పారదర్శకంగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల ఫిర్యాదుల విభాగం ద్వారా అందిన ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

**ఉత్తమ విద్యార్థిని చదువుకు పూర్తి భరోసా -- ఇంటర్ ఫీజు చెల్లింపు**



**కొత్తపేట,పెన్ పవర్,జూన్ 20:** ఆపదలో ఉన్న ఓ కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రతిభావంతమైన విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి చేయూతనందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖామాత్యులు, సాఫ్ వ్యవస్థాపకులు శ్రీ వాసంశెట్టి సుభాష్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు.

కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన చప్పిడి రామకృష్ణ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. అయితే కొంతకాలం క్రితం జేసీబీలో ఆయిల్ నింపే సమయంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో మెడ నరాలు దెబ్బతిని పక్షవాతానికి గురయ్యారు. దీంతో ఆయన మంచానికే పరిమితమవగా, కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టబడింది. రామకృష్ణకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారి విద్యాభ్యాసాన్ని కొనసాగించడం కుటుంబానికి భారంగా మారింది. ఈ విషయాన్ని స్థానికులు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించారు. రామకృష్ణ పెద్ద కుమార్తె చప్పిడి దేవి ప్రియ పదో తరగతిలో 525 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచినప్పటికీ, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆమె చదువు మధ్యలో నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలుసుకున్న మంత్రి, ఆమె ఇంటర్మీడియట్ విద్యకు అయ్యే పూర్తి ఖర్చును భరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి దేవి ప్రియను కొత్తపేటలోని అక్షర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేర్పించి, మొదటి సంవత్సరం విద్యా ఫీజును పూర్తిగా చెల్లించారు. దీంతో విద్యార్థిని ఎలాంటి ఆర్థిక భారం లేకుండా తన విద్యను కొనసాగించే అవకాశం లభించింది. మంత్రి సుభాష్ అందించిన సహాయానికి చప్పిడి రామకృష్ణ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, ఒక విద్యార్థిని భవిష్యత్తుకు భరోసా కల్పించిన మంత్రి సేవలను పలివెల గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు బొక్కా ప్రసాద్, చప్పిడి సురేష్, చిల్లి కుమార్, పల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆగిపోనున్న ఓ ప్రతిభావంతమైన విద్యార్థిని భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ మంత్రి వాసంశెట్టి సుభాష్ అందించిన చేయూత స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.

## కవిరత్న వెంకట్ పొలమూరి కిసత్కారం



**అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 29:** దళిత చైతన్య వేదిక నిర్వహణలో డా.బి.ఆర్.అంబేద్కర్ సామాజిక భవనం రాజోలు నందు జరిగిన స్వర్గీయ డా.గుర్రం ధర్మోజీరావు సంస్మరణ లో జరిగిన కవి సమ్మేళనంలో అంబాజీపేట కు చెందిన ప్రముఖ సామాజిక సహజకవి, కవిరత్న వెంకట్ పొలమూరి పాల్గొని " దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు" అంశం పై కవితా గానం చేసినందుకు వెంకట్ పొలమూరి ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డా.చిలుకోటి కూర్మయ్య, డా.బండి సత్యనారాయణ, డా.గూటం స్వామి, డా.బత్తుల మురళీకృష్ణ , పొలమూరి శ్యామ్ బాబు ,దేవ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ఆరు రోజుల క్వాంటమ్ కంప్యూటింగ్ కార్యశాల



**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 20:** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, ఈ డ ఐసీటీ అకాడమీ, ఎన్ఐటీ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్వాంటమ్ కంప్యూటింగ్ అనే అంశంపై ఆరు రోజుల హైబ్రిడ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసింది అని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు.

జూన్ 15 నుండి 20 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశంలో గల 13 విద్యా సంస్థలకు చెందిన 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎన్ఐటీలు, బిట్స్ పిలానీ, ఐబీఎం క్వాంటమ్ మరియు ఇతర ప్రముఖ సంస్థ లకు చెందిన 14 మంది పాల్గొని నాణ్యమైన సాంకేతిక ఉపన్యాసాలు అందించారు.

కార్యక్రమం ప్రారంభోత్సవం మరియు ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్. అనూరాధ, హెడ్ -- ఈ డ ఐ సి టి అకాడమీ, ఎన్.ఐ.టి వరంగల్, డా. ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ చాన్సలర్ (అకాడెమిక్స్), ఆదిత్య విశ్వవిద్యాలయం, డా. టి.ఎస్.ఎల్. రాధిక, బిట్స్ పిలానీ హైదరాబాద్, డా. వర్ష సంభాజీ, ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి డా. జి. శ్రీదేవి, ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఆదిత్య విశ్వవిద్యాలయం సమన్వయకర్త గా వ్యవహరించారు. ఆమె నాయకత్వంలో విభాగం అధ్యాపకులు మరియు నిర్వహణ బృందం సమిష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ ఎఫ్‌డీపీలో క్వాంటమ్ ఫిజిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్, క్వాంటమ్ ఆల్గోరిథమ్స్, క్వాంటమ్ ప్రోగ్రామింగ్, క్వాంటమ్ ఇమేజ్ ప్రాసెసింగ్, ఫోటో నిక్ క్వాంటమ్ కంప్యూటింగ్ మరియు క్వాంటమ్ సర్క్యూట్ డిజైన్ వంటి అత్యాధునిక అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రో.ఎం.బి.శ్రీనివాస్, ప్రో.వైస్ ఛాన్సలర్ డా.రమేష్, వివిధ విభాగాల డీన్ లు ఫాకల్టీ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం నాణ్యతను, నిపుణుల బోధనను మరియు ప్రాయోగిక శిక్షణ సభ్యులు ప్రశంసించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించినఈ డ ఐ సి టి అకాడమీ, ఎన్.ఐ.టి వరంగల్, ఆదిత్య విశ్వవిద్యాలయం యాజమాన్యం, మరియు పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజపూడి హాస్టల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు పంపిణీ





**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 20**: జగ్గంపేట మండలం రాజపూడిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్‌తో పాటు తాగునీటి గ్లాసులు, భోజన కంచాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా వసతి గృహంలో కొత్తగా నిర్మించిన ఐదు బ్లాకుల మరుగుదొడ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. పరిశుభ్రత, నీటి సరఫరా, నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ప్రాధాన్యత అన్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజన నాణ్యత, వసతి సౌకర్యాలు, చదువుకు సంబంధించిన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలని, బాత్‌రూమ్‌లు, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వంటగది, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి నిత్యావసర సరుకుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి ఖర్చులో పారదర్శకత పాటించాలని, విద్యార్థుల సంక్షేమంలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం స్వచ్ఛంద స్వచ్ఛభారత్ లో భాగంగా పరిసరాలు శుభ్రపరిచారు.

# ఎన్నికల హామీలు గాలికొదిలి విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు.




- జగ్గంపేటలో అభివృద్ధి గోరంత అవినీతి కొండంత.
- జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి,పాటంశెట్టి సూర్యచంద్ర.

**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 20**:గెలుపే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజలకు వందలాది హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అరకొర పనులు చేసి, పూర్తిగా హామీలు నెరవేర్చినట్టు మహాసభలు నిర్వహించడం ప్రజలను మోసం చేయడమే అన్నారు.?ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రధాన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని సూర్యచంద్ర విమర్శించారు.?మహిళలకు ప్రతి నెల ఇవ్వాల్సిన 1500 'మహాశక్తి' పథకం,?నిరుద్యోగులకు నెలకు 3000 భృతి ఇస్తామన్న హామీ ఏ తీరానికి చేరిందన్నారు. కౌలు రైతులకు 20,000 సాయం,ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న మాట ఏమైందని సూర్యచంద్ర ప్రశ్నించారు. వృద్ధులు,వితంతువులు, వికలాంగుల పింఛన్ల పరిస్థితి ఏంటని, కాపు,ఎస్సీ, బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా ఉత్సవాలు ఎలా చేసుకుంటారని సూర్యచంద్ర ప్రశ్నించారు.జగ్గంపేట నియోజకవర్గంలో 25 వేల ఇళ్లు నిర్మిస్తాం.25 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తాం" అని నమ్మబలికిన ఎమ్మెల్యే, ఆయన కుమారుడు జ్యోతుల నవీన్ కుమార్ ఇప్పుడు ఆ హామీలను పూర్తిగా మర్చిపోయారని సూర్యచంద్ర మండిపడ్డారు.హామీల అమలులో సున్నా సాధించిన వీరు 200 కోట్ల అవినీతి మార్కును దాటి దోపిడీలో మాత్రం రికార్డు సృష్టించారని ఆరోపించారు.ఎన్నికల ముందు ఏలేరు నది ఆధునీకరణ చేస్తామన్నారు,తీరా గెలిచాక ఏలేరులోని ఇసుక మొత్తాన్ని దోచేస్తూ ఇసుక మాఫియాగా మారారన్నారు.మల్లవరం ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామన్నారు నేటికీ పనులు మొదలుపెట్టలేదన్నారు.ఎన్నికల ముందు ?కిర్లంపూడి, గోకవరం మండలాల్లో డిగ్రీ కాలేజీలు ఏర్పాటు అన్నారు నేడు ఆ ఊసే లేదు. గెలిచిన వెంటనే గోకవరంలో ఫైర్ స్టేషన్, సంత మార్కెట్ నిర్మిస్తామన్నారన్నారు.గెలిచి రెండేళ్లయిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుంది. గ్రామాల్లో సీసీ డ్రెయిన్లు నిర్మిస్తామన్న మాట నీటిమూటలైందన్నారు.స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆయన కుమారుడు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో జగ్గంపేటలో జరిగింది కేవలం 10 శాతం అభివృద్ధే.. కానీ అవినీతి మాత్రం 90 శాతం జరిగిందన్నారు.ప్రజా సమస్యలపై గళమెత్తుతూ, అవినీతిని ప్రశ్నిస్తున్న తమపై తప్పుడు కేసులు బనాయించడం చేతగానితనానికి నిదర్శనమన్నారు.కేసులకు భయపడే పనిలేదని ప్రజలకు సమాధానం చెప్పి తీరాల్సిందేనని సూర్యచంద్ర స్పష్టం చేశారు.రేపు జగ్గంపేటలో జరగబోయే కూటమి విజయోత్సవ మహాసభ వేదికగా.. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని ఏ తేదీలోగా, ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టమైన 'యాక్షన్ ప్లాన్' ప్రకటించాల్సిన బాధ్యత శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూపై ఉందని, ప్రజలకు సమాధానం చెప్పి తీరాలని పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు.

# ఏడువారాల చందన వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం







- తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆధ్యాత్మిక శోభతో అలరించిన కోనసీమ తిరుమల వాడపల్లి

**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 20**:కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏడువారాల చందన వెంకన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఏడువారాల నోము నోసుకుని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేకువజాము నుంచి సంధ్యావేళ వరకు ఆలయ ప్రాంగణం, మాడవీధులు గోవింద నామస్మరణలతో మారుమోగాయి.వేకువజామున ఆలయ అర్చకులు స్వామివారికి మేలుకొలుపు సేవ, అలంకరణోత్సవం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, సుప్రభాత సేవలను వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం తొలి హారతితో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఏడువారాల నోము నోసుకున్న భక్తులు ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహిస్తూ గోవింద నామస్మరణతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించడంతో పాటు ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని కూడా సేవించారు.శనివారం స్వామివారిని కొత్తపేట ఆర్డీఓ సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.


ఆలయానికి విచ్చేసిన భక్తులను రాజమహేంద్రవరం శ్రీ శివకేశవ నృత్యాలయం కళాకారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ నృత్యాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉట్టిపడేలా చేశారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధర్ రావు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అలాగే ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము తన సిబ్బందితో ఆలయ ప్రాంగణం మొత్తం పటిష్ట భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. వేకువజాము నుంచి సంధ్యావందనం వరకు తగ్గని భక్తుల రద్దీ మధ్య వాడపల్లి క్షేత్రం భక్తిశ్రద్ధలతో కళకళలాడింది.





# వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి ఎన్. హరినాథ్





**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 20**: కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి ఎన్. హరినాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థాన అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు న్యాయమూర్తి ఎన్. హరినాథ్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. స్వామివారి చిత్రపటంతో పాటు మహాప్రసాదాలను అందజేసి ఆశీస్సులు అందించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు నిర్వహించారు.కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. న్యాయమూర్తి రాక సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తిమయ వాతావరణం నెలకొంది. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రానికి విశిష్ట వ్యక్తులు తరచూ విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# అన్నదాతల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం





- రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నాం
- మంత్రి వాసంశెట్టి సుభాష్

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 20**: రైతుల మోముల్లో చిరునవ్వు చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ "అన్నదాత సుఖీభవ – – పీఎం కిసాన్" పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతు కుటుంబాలకు సంవత్సరానికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందించే విధంగా పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,125.47 కోట్ల ఆర్థిక సాయాన్ని జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000లు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.2,000లు అందజేస్తోందని తెలిపారు. రామచంద్రపురం,కె.గంగవరం, కాజులూరు మండలాల రైతులు ఈ పథకం ద్వారా గణనీయంగా లబ్ధి పొందుతున్నారని మంత్రి చెప్పారు. గత 2025–26 ఆర్థిక సంవత్సరంలో రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో 24,137 మంది రైతు కుటుంబాలకు రూ.47.28 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరిందని వివరించారు. అలాగే 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత నిధులను జూన్ 20న విడుదల చేసినట్లు తెలిపారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతు కుటుంబాల ఆదాయం పెంచేందుకు,వ్యవసాయ వ్యయభారం తగ్గించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.అన్నదాత సుఖీభవ పథకం రైతులకు ఆర్థిక భరోసా కల్పించే గొప్ప కార్యక్రమమని,ప్రతి అర్హ రైతు ఈ పథకం ప్రయోజనాలు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ మనం అంతా సంక్షోభం నుంచి .. సంక్షేమంలోకి రావడం జరిగిందని గుర్తు చేశారు.రైతుల సంక్షేమం,అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ రైతులు ధాన్యాన్ని విక్రయించుకునేందుకు సుమారు 20 రైస్ మిల్లుల్లో కొనుగోళ్లకు మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. అలాగే ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మూడు కంటైనర్ ఆస్పత్రులు,ఒక సంచార వైద్యశాల,మూడు ఎలక్ట్రిక్ ఆటో అంబులెన్సులు సేవలందిస్తున్నాయని తెలిపారు.జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు.గత వైసీపీ పాలనలో రైతులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగేశ్వరి నాగార్జున మాట్లాడుతూ కూటమి అంటే రైతు పక్షపాతి అన్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి ఇండక్షన్ స్టౌవ్లు, వంట సామాగ్రి మంత్రి సుభాష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ (ఇన్‌చార్జి) అరుణ,మండల వ్యవసాయ అధికారులు మణిదీప్,వి.అశోక్, సద్గురుమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు చవ్వాకుల డాక్టర్ బాబు, డీసీలు లకాని కృష్ణ చైతన్య,పేపకాయల బాబ్జి, గోపాల రాజు,జనసేన మండల అధ్యక్షులు బొండా వెంకన్న, శలపాక నీటి సంఘం అధ్యక్షులు తాడి రామారెడ్డి, సలాది శ్రీనివాస్,వనుం వీరబ్రహ్మం , వల్లు అర్జున్, దూడల శంకర్ నారాయణ,రొక్కాల సత్తిబాబు, కొల్లు వెంకటేశ్వరరావు, పోతురాజు భీమారావు,టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, వివిధ సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, అంగన్వాడీ



మహిళలు,రైతు ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఆరోగ్యకరమైన జీవితానికి యోగ్యమైన యోగ



**గండేపల్లి, పెన్ పవర్,జూన్,20**: ప్రపంచవ్యాప్తంగా 2026 జూన్ 21న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం' థీమ్‌తో నిర్వహించబోయే ఈ వేడుకల విశేషాలు, చరిత్ర, ప్రాధాన్యత పై ప్రత్యేక కథనం.శారీరక, మానసిక ఉల్లాసానికి భారతదేశం ప్రపంచానికి అందించిన అద్భుతమైన కానుక యోగా. ప్రతి ఏటా జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటారు. సంస్కృత మూల పదం 'యుజ్' నుండి యోగా అనే పదం పుట్టింది. దీని అర్థం 'కలపడం' లేదా 'ఏకం చేయడం'. శరీరం–మనస్సు, ఆలోచన–ఆచరణ, నియంత్రణ–తృప్తి, మానవుడు–ప్రకృతి మధ్య సామరస్యాన్ని సాధించడమే యోగా ముఖ్య ఉద్దేశం. సంపూర్ణ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు ఇది ఒక చక్కని మార్గం. 2026 అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే థీమ్‌ను ఖరారు చేశారు. పెరుగుతున్న వయసులోనూ ఉత్సాహాన్ని, రోగనిరోధక శక్తిని, స్వావలంబనను పెంపొందించడంలో యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ థీమ్ వివరిస్తుంది. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో, సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో యోగా పాత్రను ఇది నొక్కి చెబుతుంది."ప్రస్తుత కాలంలో ఈ థీమ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. మనుషుల సగటు జీవితకాలం పెరుగుతున్న తరుణంలో, వృద్ధాప్యాన్ని ఆరోగ్యంగా, హుందాగా ఎలా ఆహ్వానించాలో తెలుసుకోవడం చాలా అవసరం. మన ప్రాచీన భారతదేశంలో మునులు, యోగులు యోగా శక్తి, ఆధ్యాత్మిక క్రమశిక్షణ ద్వారా సుదీర్ఘ కాలం పాటు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించారు," అని కేంద్ర ఆయుష్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావ్ జాదవ్ ఈ థీమ్ ప్రాధాన్యతను వివరించారు. యోగా దినోత్సవం చరిత్ర ప్రాధాన్యత : ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014 సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ (యు ఎన్ జి ఏ ) 69వ సమావేశంలో మొదటిసారిగా తీసుకువచ్చారు."యోగా అనేది మన ప్రాచీన సంప్రదాయం అందించిన అమూల్యమైన కానుక. ఇది మనస్సు, శరీరం, ఆలోచన, ఆచరణల కలయిక. సంపూర్ణ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. యోగా అంటే కేవలం వ్యాయామం మాత్రమే కాదు; మనతో, ప్రపంచంతో, ప్రకృతితో ఏకత్వాన్ని కనుగొనే మార్గం" అని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పీఎం మోదీ ప్రసంగించారు.ఈ ప్రతిపాదనకు ప్రపంచ దేశాల నుండి భారీ మద్దతు లభించింది. దీంతో ఐక్యరాజ్యసమితి ఒక తీర్మానాన్ని ఆమోదించి జూన్ 21 ని అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించింది. మొదటి యోగా దినోత్సవాన్ని 2015 జూన్ 21న ఘనంగా నిర్వహించారు.ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది: ఈ దినోత్సవం యోగా విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా.. శరీరం, మనస్సు, ఆత్మకు అది చేకూర్చే ప్రయోజనాలను వివరిస్తుంది. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీరానికి ఫ్లెక్సిబిలిటీ, బలం చేకూరుతాయి. మానసిక ప్రశాంతత లభించడంతో పాటు ఒత్తిడి అధిగమించడానికి సులువవుతుంది. ప్రజలు తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకునేలా ప్రోత్సహించడం, ఆధునిక జీవనశైలి వల్ల వచ్చే జబ్బులపై అవగాహన పెంచడమే ముఖ్య ఉద్దేశం. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు మన పెద్దలు ఎంత సంపాదించినా ఆరోగ్యం లేకపోతే జీవితం నిష్ప్రయోజనం సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగ మన జీవన గమనంలో భాగం కావాలి .. అది ఒక రోజు ముగిసే ప్రక్రియ కాకూడదు మన నిత్యజీవితంలో భాగం చేద్దాం ఆరోగ్యంగా జీవిద్దాం..–తోటకూర గంగాధర్ .,జాతీయ పర్యావరణ మిత్ర ఆదిత్య యూనివర్సిటీ

## భాష్యం స్కూల్లో ఘనంగా ప్రపంచ యోగ దినోత్సవం



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 20:** జగ్గంపేట రావులమ్మ నగర్ లోని భాష్యం పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ముందస్తు యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ యోగ సాధన ద్వారా మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను, రాగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు అన్నారు. యోగ మన జీవితంలో భాగమైపోయిందని యోగాసనాలు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. మన జీవితంలో యోగాను భాగంగా చేసుకుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గి మనకు వచ్చే చాలా ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేశారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్చార్జి గోవిందరాజు యోగా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా శనివారం శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ



**అన్నవరం పెన్ పవర్ జూన్ 20:**కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధానం లో శనివారం కావడంతోఘనంగా ప్రాకార సేవ నిర్వహించారు. ముందుగా అర్చకులు సత్యదేవుడు అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై గావించి వేద పండితుల మంత్రోచ్ఛరణ భక్తుల నామస్మరణతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ ప్రాకార సేవా కార్యక్రమంలో ఆలయ అర్చకులు మరియు దేవస్థానం సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## "సర్"లో అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రత్తిపాడు బీఎస్పీ ఇన్చార్జ్ గునపర్తి అపురూప్..



**శంఖవరం పెన్ పవర్ జూన్ 20:–** కాకినాడ ప్రత్తిపాడు నియోజకవర్గం లో మండల కేంద్రమైన శంఖవరం ఓటర్ల జాబితా సవరణ అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని బహుజన సమాజ్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ గునపర్తి అపురూప్ అన్నారు.
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను అడ్డుపెట్టుకొని అధికార పార్టీ చేసే కుట్రని తిప్పి కొట్టేందుకు నాయకులు కార్యకర్తలు నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. ఓటర్ల హక్కుని కాపాడే బాధ్యత బిఎస్‌పి లదే అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత బిఎల్ఏ ల పై ఉందన్నారు. ప్రత్యేక సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడం, అనర్హులను చేర్చడం, మ్యాపింగ్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం ప్రజా స్వామ్యంలో ప్రమాదకరమన్నారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి అక్రమాలకు పాల్పడితే తన దృష్టికి తీసుకు రావాలని నాయకులకు కార్యకర్తలకు బూత్ లెవెల్ ఏజెంట్లకు తెలియజేశారు

## ఏలేశ్వరంలో అంగన్వాడి సెంటర్ ను పరిశీలించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే .





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 20:** స్థానిక అంబేద్కర్ నగర్ లో అంగన్వాడి కేంద్రాని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శనివారం పరిశీలించారు.
సక్ష్యం అంగన్వాడీ ప్రీ స్కూల్ లో పాటించవలసిన నియమాలపై ఆరా తీశారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలని అన్నారు.
గ్రుడ్లు, పాలు, ఆహార పదార్థాలను నిర్ణీత సమయంలో చిన్నారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి,జ్యోతుల పెదబాబు, రుచి రమేష్, ఎండగుండి నాగబాబు, సామంతుల గోపి, జిగటాపు సూరిబాబు, పలివెల శ్రీనివాస్, నూకతాటి ఈశ్వరుడు, పెంటకోట శ్రీధర్, అంగన్వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విలేఖరి కుమార్తె సుంకర జాహ్నవి కి కొండంత అండగా ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 20:** దివంగత విలేకరి సుంకర సత్యనారాయణ కుమార్తె శుంకర జాహ్నవికి కొండంత అండగా ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ నిలిచింది. ఈ నేపథ్యంలో యాజమాన్యం పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మూడు సంవత్సరాల క్రితం ఆకస్మికంగా గుండెపోటు తో మృతి చెందిన విలేఖరి సత్యనారాయణ కుటుంబం ఆర్థిక ఇబ్బంది పడుతుండడంతో ఆయన కుమార్తెకు స్థానిక ప్రైవేట్ పాఠశాల ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఉచిత విద్యను అందించి ఉదారతను చాటారు.ఆయన మరణంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురైంది. విలేఖరి సత్యనారాయణ కుమార్తె సుంకర జాహ్నవి ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ లో చదువుతుండడంతో పాఠశాల కరస్పాండెంట్ దాసరి వీర వెంకట సత్యనారాయణ జాహ్నవికి వరుసగా మూడు సంవత్సరాలు 8,9,10 తరగతుల్లో ఉచిత విద్యను అందించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ సుంకర సత్యనారాయణ తనకు మంచి మిత్రుడని,ఆయన ఆకాల మరణం చెందడంతో ఆ కుటుంబానికి సహాయం చేయాలని ఉద్దేశంతో జాహ్నవికి ఉచిత విద్యను అందించడం జరిగిందని, జాహ్నవి 534 మార్కులతో పదవ తరగతి ఉత్తరత సాధించడంతో ఆమెకు శనివారం ఉత్తీర్ణత పత్రాలను, స్థానిక విలేకరుల సమక్షంలో అందజేశారు.జాహ్నవి బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యఅతిథి బిఏ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థికి ఉచిత విద్య అందించడమే కాకుండా మంచి మార్కులతో పాస్ అయ్యేలా తర్ఫీదునిచ్చిన పాఠశాల అధ్యాపక బృందాన్ని,యాజమాన్యాన్నీ అభినందించారు.సీనియర్ విలేఖరి ఎండి అధికార్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాటు ఎటువంటి రుసుమం తీసుకోకుండా విద్యను అందించడం కరస్పాండెంట్ మంచి మనసుకు,సేవా తత్పరతకు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాత్రికేయులు కోరాడ శ్రీనివాసరావు,సాలా మల్లికార్జునరావు,దొంతంశెట్టి సతీష్,మువ్వల శ్రీనివాసరావు,దాసరి కృష్ణ,పారేపల్లి గంగా ప్రసాద్,కొల్లిపర దుర్గా శ్రీనివాస్,పోతుల లోవరాజు,ఇమ్రాన్ ఖాన్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


### సోమవరం గ్రామానికి రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్లు మంజూరు.

* పనుల పురోగతిని పరిశీలించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**కిర్లంపూడి,పెన్ పవర్, జూన్ 20:**కిర్లంపూడి మండలం సోమవరం గ్రామ రూపురేఖలు మారేలా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ.45 లక్షల వ్యయంతో గ్రామంలో సిమెంట్,కాంక్రీట్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వయంగా గ్రామాన్ని సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.ఉన్నత పాఠశాల నుండి బ్యాంకు వరకు, గ్రామ పంచాయతీ నుండి ఏలేరు నది వరకు నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల నాణ్యతను పరిశీలించారు.పనుల్లో నాణ్యత, విషయంలో అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ “మాటలు కాదు–చేతల్లో చూపించడమే కూటమి ప్రభుత్వ విధానం.రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నాం.గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.అందుకే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు, కాలువలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నాం. సోమవరం గ్రామంలో ఇకపై బురద రోడ్ల సమస్య ఉండదు. ప్రతి వీధి సిమెంట్ రోడ్డుతో మెరవనుంది.పనుల్లో నాణ్యత విషయంలో రాజీ లేదు. ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదు” అని స్పష్టం చేశారు.గ్రామంలో దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటించి పనులను పర్యవేక్షించిన తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జంపన సీతారామచంద్ర వర్మ, సూతి శ్రీను,జంపన రవి వర్మ,గంగిరెడ్ల దొరబాబు, మంచికంటి శ్రీను,జ్యోతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ సంవత్సర మొదటి విడత పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ రాజా






**శంఖవరం పెన్ పవర్ జూన్ 20:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో
శంఖవరం మండలం కత్తిపూడి (సీతంపేట)లో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 2026 వ 27 సంవత్సర మొదటి విడత పంపిణీ లాంచనంగా
ప్రారంభించారు.
అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ నిధులు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విడుదల చేశారు. రైతులు ఖాతాలోకి నేరుగా అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 5వేలు, పీఎం కిసాన్ పథకం ద్వారా 2వేల రూపాయల నేరుగా జమ చేయడం జరుగుతుంది.
ఈ పథకం ద్వారా ప్రత్తిపాడు నియోజకవర్గంలో 31634 మంది రైతులకు చేకూరగా 20.78 కోట్ల లబ్ది పొందనన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ,ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలో రైతులకు చేయదించే విధంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని నేరుగా రైతులు ఖాతాల్లోకి ఈరోజు జమ చేయనున్నారని అన్నారు.
రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సారథ్యంలో అభివృద్ధి సంక్షేమాలు పరుగులు పెడుతున్నాయని అభివర్ణించారు. నియోజకవర్గ రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఈ సందర్భంగా భరోసాని ఇచ్చారు.
మళ్లీ ప్రకృతి సేద్యం వైపు ప్రపంచం చూస్తోందని తెలిపారు. రైతులకు లాభసాటిగా ఉండాలని పంటలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు.
మనం ప్రకృతి సేద్యం వైపు మారాలని తెలిపారు.
వైసీపీ హయాంలో రైతులకు అన్నీ కష్టాలే అని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉందని వ్యాఖ్యానించారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన.. 6 నెలలకు కూడా డబ్బులు వచ్చేవి కాదని అన్నారు. ఇప్పుడు 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని వివరించారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, ఖాదీ చిన్న పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ములు కన్నబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, గంటుమల్ల రాజ్యలక్ష్మి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ బద్ది మణి రామారావు, మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెద్దబాబు, ఈగల దేవుళ్ళు, అలమడ చలమయ్య, బొదిరెడ్డి గోపి, పైలా సాంబశివరావు, ఇతశీశెట్టి భాస్కర్ బాబు, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, వజ్ర కూటం మాజీ సర్పంచ్ కీర్తి సుభాష్, వేర్ల సూరిబాబు, గాబు కృష్ణమూర్తి, బొమ్మిడి సత్తిబాబు, బస్సా ప్రసాద్, మైరాల కనకారావు, మంతిన వెంకటరమణ, సాధనాల లక్ష్మీ బాబు, గొంది టిడిపి నాయకురాలు వనలక్ష్మి, సూతి భూరయ్య, ఏవోలు, పడాల గాంధీ, ఏ రాజేష్, జోక అమృత, ఆర్ ఈశ్వరరావు, పలువురు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.




## స్వచ్ఛాంధ్ర లక్ష్యంతో మంజేరు గ్రామంలో విస్తృత పారిశుధ్య కార్యక్రమం





**కాజులూరు, పెన్ పవర్,జూన్ 20:** స్వచ్ఛాంధ్ర––స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా మండల పరిధిలోని మంజేరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల మూడవ శనివారం చేపట్టే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధులు, ప్రజా ప్రదేశాలు, కాలువల పరిసరాలను శుభ్రపరిచారు.ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది కలిసి గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా నిర్వహించాలని ప్రజలకు సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కూటమి నాయకులు దడాల నాగార్జున, పుణ్యమంతుల రామకృష్ణ మాట్లాడుతూ స్వచ్ఛమైన గ్రామాల నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరబాబు, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొని గ్రామ పరిశుభ్రత కోసం శ్రమదానం చేశారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## మా తండ్రి ముద్రగడ ఆరోగ్యంగానే ఉన్నారు.

**–ఆస్పత్రిలో వైద్యులు పరివేక్షణలో నాన్నకు వైద్యం అందుతుంది.**

**–ఎవరూ కూడా ఆందోళన చెందవద్దు.**

**–మాజీ మంత్రి ముద్రగడ తనయుడు ముద్రగడ బాలు.**

**కిర్లంపూడి, పెన్ పవర్,జూన్ 20:**మా తండ్రి,మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం హైదరాబాద్లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో గత కొన్ని రోజుల నుండి వైద్యులు పర్యవేక్షణలో వైద్యం చేయించుకుంటున్నారు.ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని, ఆయన ఆరోగ్యం పై వస్తున్న వదంతుల్ని నమ్మవద్దని ముద్రగడ పద్మనాభం పెద్ద కుమారుడు ముద్రగడ బాలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అభిమానులు, వైసీపీ కార్యకర్తలు,భగవంతుని ఆశీస్సులతో తిరిగి వస్తారని ప్రార్థిస్తున్నామన్నారు.



## కొత్తపేట మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం







**కొత్తపేట,పెన్ పవర్,జూన్ 20:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం కొత్తపేట మండల వ్యాప్తంగా వేగంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు), బూత్ లెవెల్ అసిస్టెంట్లు (బీఎల్ఏలు) ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ సవరణ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఈనెల 15వ తారీఖున మొదలైన ఈ కార్యక్రమం నెలపాటు నిర్వహిస్తున్నామని గ్రామాల్లోని ప్రజలకు ముందస్తుగా సమాచారం అందిస్తూ ఇంటింటికీ చేరుకుంటున్న అధికారులు, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానాల ప్రకారం ఓటర్లకు ప్రత్యేక ఎస్ఐఆర్ ఫారాలను అందజేస్తున్నారు. ఒక ఫారం ఓటరు వద్ద ఉంచేలా,ఒక ఫోటో అతికించిన మరో ప్రతిని అధికారుల వద్ద భద్రపరిచేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ సందర్భంగా ఓటర్ల వివరాలు, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, వయస్సు తదితర అంశాలను ధృవీకరిస్తూ డిజిటల్ విధానంలో నమోదు చేస్తున్నారు. అలాగే అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు, తప్పుల సవరణ వంటి ప్రక్రియలను కూడా చేపడుతున్నారు.
అధికారులు సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ, ఆధార్ ఇతర సంబంధిత గుర్తింపు వివరాలతో అనుసంధానం చేసే పనులను నిర్వహిస్తున్నారు. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు ప్రజలకు పూర్తి సహకారం అందించాలని, తమ వివరాలను సక్రమంగా అందించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగుతుండగా, బీఎల్ఓలు, బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు.

# స్వచ్ఛ ఆంధ్రా,స్వర్ణ ఆంధ్రా, కూటమి ప్రభుత్వ లక్ష్యం.






**-ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూన్ 20:** స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర, కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు.మండల కేంద్రమైన ప్రత్తిపాడులో

ప్రతీ నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా, జనసేన నాయకులు మెడిశెట్టి బాబి. రాష్ట్ర ఖాదీ చిన్న పరిశ్రమల శాఖ వైస్ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు. ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ప్రత్తిపాడులో గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ఎంపీడీవో కుమార్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన "స్వచ్ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర"

ఈ కార్యక్రమములో భాగంగా ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. గ్రామ పంచాయితీకి సంబంధించిన శానిటేషన్ సిబ్బంది కి గ్రామంలో చెత్తను సేకరించడానికి ఉపయోగపడే రిక్షాలను నేతల చేతులు మీదుగా పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే సత్యప్రభ స్థానిక నాయకులతో కలిసి పరిశుద్య పనులను చేపట్టారు రోడ్లు డ్రైనేజీ లను శుభ్రం చేశారు. స్వర్ణాంధ్ర,స్వచ్ఛఆంధ్ర అంటూ నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహాయపడాలని పిలుపు నిచ్చారు. పర్యావరణ రహిత సంచులను వినియోగించటం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన గ్రామాలు ఏర్పడతాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎం వి ఆర్ కుమార్ బాబు,కూటమి నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగుల నాని, పంచాయతీ అభివృద్ధి అధికారి జ్యోతుల పద్మరాజు, యాళ్ల విశ్వేశ్వరరావు, అంబటి బుజ్జి,బొల్లు కొండబాబు, పలువురు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యాలకు పోలీసు శాఖ అంకితం





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 20:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా స్వచ్ఛత,పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు,సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిసరాలను శుభ్రపరిచారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తూ స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహద పడతాయని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో అధికారులు, సిబ్బంది అందరూ కలిసి స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ కోసం కృషి చేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కాకినాడ అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్బీ డీఎస్పీ కెవివి సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరి రావు,మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. దుర్గాప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు, రిజర్వ్ ఎస్ఐ వల్లీబాబా తదితర అధికారులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.అలాగే జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలోనూ స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్ఐలు,సీఐలు,పోలీసు సిబ్బంది స్టేషన్ ఆవరణలను శుభ్రపరిచి పరిశుభ్రతపై ప్రజలకు సందేశం ఇచ్చారు.

## జనార్ధన స్వామి వారి ఆలయంలో భక్తుల సందడి



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 20;**ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నారద ప్రతిష్టమైన జనార్ధన స్వామి కొలువున్న ఈ ఆలయానికి ఆలమూరు నుంచి మాత్రమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు శనివారాలు, నాలుగు ప్రదక్షిణలు చేసే భక్తులు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి అలంకరణ విశేషంగా భక్తులను ఆకట్టుకుంది. ఆలయ అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవానాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలపకుండా దగ్గరుండి మరీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నిర్మాణం పూర్తయిన విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 20;**మండలంలోని చింతలూరు గ్రామంలో నిర్మాణం పనులు పూర్తయిన విలేజ్ హెల్త్ క్లినిక్ ను ఎంపీడీవో ఏ రాజు స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ముందుగా భవన నిర్మాణం,నాణ్యత, మౌలిక సదుపాయాల వసతులను వీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ లు ఉపయోగపడతాయని, ప్రభుత్వం గ్రామీణ ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తూ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు శాశ్వత భవనాలు నిర్మిస్తుందన్నారు. త్వరలోనే ఈ విలేజ్ హెల్త్ క్లినిక్ ను ప్రారంభించి పేద ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ నూకాంకా అమ్మవారి మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వైట్ల శేషుబాబు, నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు,కాలా సాయిబాబు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలి.



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 20;**ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆలమూరు మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రొద్దోకు అజయ్ ఎంఈఓ-2 రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ మధ్యతరగతి, పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలలో అధిక ఫీజులతో పాటుగా బుక్స్, యూనిఫామ్ పేరుతో అధిక వసూలు చేస్తున్నారని, విద్యతో వ్యాపారాలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.





**కిర్లంపూడి, పెన్ పవర్,జూన్ 20:** కిర్లంపూడి మండలం సోమవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే,టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని మౌలిక వసతులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. పాల ప్యాకెట్లు, కోడిగుడ్లు, ఇతర నిత్యావసర సరుకుల నిల్వలు,వాటి ఎక్స్‌పైరీ తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీలోని చిన్నారులతో మమేకమై వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అన్నం రుచిగా ఉందా? రోజూ ఏం నేర్చుకుంటున్నారు,అంటూ ఆప్యాయంగా పలకరించారు. పిల్లలకు అందుతున్న విద్య, పోషణపై అంగన్‌వాడీ టీచర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, "బాలల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలే పునాది. ఇక్కడ పిల్లలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్యతో పాటు ప్రేమ, ఆప్యాయత కూడా అందాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగాలి. అదే మన లక్ష్యం" అని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరేలా పారదర్శకంగా పనిచేయాలని, కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జంపన సీతారామచంద్ర వర్మ, జంపన రవి వర్మ, గంగిరెడ్ల దొరబాబు, మంచి కంటి శ్రీను, జ్యోతుల చిన్ని, సూతి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం- 350 మందికి వైద్య సేవలు.

**ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ సేవలు ఆదర్శం**





**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 20;**మండలంలోని చింతలూరు గ్రామంలో శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణము నందు శనివారం ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, ఏజిపి బూసి విద్య ప్రసన్న పర్యవేక్షణలో గన్ని నారాయణరావు,గన్ని సూర్యలక్ష్మి, గన్ని వెంకటరావు సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వైద్య శిబిరంలో ధరణి వాస్కులర్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, రమా దంత వైద్యశాల వైద్య బృందాలు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాయి. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి, దంత మరియు ఇతర ప్రత్యేక వైద్య సేవలను అందించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వంటిపల్లి సతీష్, ఈదర నల్లబాబు, వైట్ల శేషుబాబు, సలాది నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఏ. రాజు, నూకాంబికా అమ్మవారి దేవస్థానం చైర్మన్ వీరి అప్పారావు పాల్గొని ప్రారంభించారు. అలాగే విద్యాభ్యాసంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఏఐ అండ్ ఎంఎల్ విద్యార్థి శశాంక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 350 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. వైద్యుల సూచనలు మేరకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బలుసు శ్రీను, ముప్పిరి వెర్రియ్య, దండంగి రామారావు, దిడ్డి రాము, కాలా సాయిబాబు, గొడవర్తి కృష్ణమూర్తి, ఈవో వీర్రాజు చౌదరి, బూసి చిట్టికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సమాజం మనందరి బాధ్యత- ఎంపీడీవో రాజు




**ఆలమూరు,పెన్ పవర్, జూన్ 20;**పల్లెలు పరిశుభ్రతను సాధించాలంటే స్వచ్ఛమైన సమాజానికి మనందరం కట్టుబడి బాధ్యతగా పనిచేద్దామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో ఏ.రాజు, తహసీల్దార్ కె. కుశరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రం లో "స్వచ్ఛ భారత్ - స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్" కార్యక్రమంలో శనివారం వారి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో ఘనంగా నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేసి, అనంతరం వారంతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి ప్రాథమిక కర్తవ్యమని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, పరిసరాల పరిశుభ్రత అత్యంత కీలకమని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదని హెచ్చరించారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చెత్తను రీసైక్లింగ్ కేంద్రాలకు పంపి ఆదాయం పొందే దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రాష్ట్రం మొత్తం స్వచ్ఛాంధ్రగా మారుతుందని ఎంపీడీఓ రాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, వ్యవసాయ శాఖ ఏవో బి.మీనా, డీటీ మంగారావు, డిప్యూటీ ఎంపీడీవో ఎస్ వీర్రాజు, సబ్ రిజిస్టర్ స్వర్ణ కుమారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు జూనియర్ అసిస్టెంట్ సతీష్,కంప్యూటర్ ఆపరేటర్ వలీ, పలు శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా:







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 20:**సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ సెక్రటరీ మందలపర్తి హరీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడికొండ శ్రీనివాసు, నాయకులు ఎమ్. కాటంరాజు, ముత్యం మరియు మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ హైకోర్టు తీర్పుల ప్రకారం తక్షణమే రెగ్యులరైజ్ (శాశ్వతం) చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పట్టణ జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించాలని, విధి నిర్వహణలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన కార్మికుల పిల్లలకు తక్షణమే కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే, 1953 నుండి అమల్లో ఉన్న సాంప్రదాయం ప్రకారం మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నూతన పీఆర్సీ నియమించి 30% మధ్యంతర భృతి (ఐ ఆర్ ) ప్రకటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోతే, రాబోయే రోజుల్లో కార్మికులందరినీ ఏకం చేసి ఉద్యమాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్తామని, నిరసనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం, పైన పేర్కొన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని (మెమొరాండం) తాడేపల్లిగూడెం మున్సిపల్ మేనేజర్‌కు రవి సుధాకర్ కార్మిక సంఘ నాయకులు సమర్పించారు.

# ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు







### సమాజానికి సేవ చేసే ఉత్తమ ఫార్మాసిస్టులుగా ఎదగాలి -- డాక్టర్ అవినాష్

**గంగవరం, పెన్ పవర్, జూన్ 20:**ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 2022-2026 బ్యాచ్ బి.ఫార్మసీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాధరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ అవినాష్ గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, వృత్తిపరమైన నైతిక విలువలు, నిజాయితీ, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. ఆదర్శ కాలేజ్ నుంచి పట్టభద్రులవుతున్న విద్యార్థులు దేశానికి, సమాజానికి ఆదర్శవంతమైన ఫార్మాసిస్టులుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

కళాశాల చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంలో చూపిన కృషి అభినందనీయమని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.కళాశాల కార్యదర్శి డాక్టర్ నాగమణి మాట్లాడుతూ పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉన్నత విద్యను అభ్యసించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ జీవితంలో సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఉందని, కష్టపడినంత మేరకు అభివృద్ధి సాధ్యమవుతుందని విద్యార్థులకు సూచించారు.డైరెక్టర్ డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీతో సరిపెట్టుకోకుండా ఉన్నత విద్య, ప్రత్యేక నైపుణ్యాలను సంపాదించుకోవాలని సూచించారు.డాక్టర్ ప్రవలిక మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు జీవితంలో క్రమశిక్షణ, సమయపాలనతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాపర్లకు, అలాగే అకాడమిక్, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులు అందజేసి సత్కరించారు.

గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులు మాట్లాడుతూ తమకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యాలను అందించిన ఆదర్శ కాలేజ్ యాజమాన్యానికి, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ విజయానికి అండగా నిలిచిన తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుజిని, కళాశాల కోఆర్డినేటర్ పి శ్రీనివాస్, కళాశాల యాజమాన్య సభ్యులు, వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం







- కొత్తపేట నియోజకవర్గంలోని 23,085 మంది అన్నదాతలకు రూ.15.25 కోట్ల జమ
- పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**పెన్ పవర్ రావులపాలెం జూన్ 20:**రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే నమ్మకంతో కూటమి ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, అనపర్తి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు ఆకుల రామకృష్ణ, ఆత్మ చైర్మన్ జక్కంపూడి బాలాజీ తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు.

కార్యక్రమానికి ముందు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పండించిన సేంద్రీయ ఉత్పత్తులను పరిశీలించిన ఎమ్మెల్యే, అనంతరం 23,085 మంది రైతులకు రూ.15.25 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు.

గత ఏడాది పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం అందించిన రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.14 వేలు జతచేసి ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున మొత్తం రూ.43.46 కోట్లు కొత్తపేట నియోజకవర్గ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. తాజాగా తొలి విడతలో కొత్తపేట మండలంలోని 6,516 మందికి రూ.4.22 కోట్లు, ఆత్రేయపురం మండలంలోని 5,258 మందికి రూ.3.56 కోట్లు, రావులపాలెం మండలంలోని 5,018 మందికి రూ.3.22 కోట్లు, ఆలమూరు మండలంలోని 6,293 మందికి రూ.4.25 కోట్లు కలిపి మొత్తం 23,085 మంది రైతులకు రూ.15.25 కోట్లను జమ చేస్తున్నట్లు వెల్లడించారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.14 వేలు జతచేసి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని, రైతు పక్షపాతి ప్రభుత్వంగా మరోసారి నిరూపించుకుందని చెప్పారు. ఎరువులను సబ్సిడీ ధరలకే అందిస్తూ, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని, ధాన్యం విక్రయించిన కొద్ది గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగుపై దృష్టి సారించాలని, సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు.

కార్యక్రమంలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# 'మన ఊరు--మాట మంతి'లో ప్రజా సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యక్ష సమీక్ష




### రైతులు, మత్స్యకారులకు ఆర్థిక సాయం

**కాకినాడ, పెన్ పవర్ జూన్ 20:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శనివారం కాకినాడలో నిర్వహించిన "మన ఊరు--మాట మంతి" కార్యక్రమంలో పాల్గొన్నారు.స్థానిక రాజా ట్యాంకు సమీపంలోని గోదావరి కళాక్షేత్రంలో కాకినాడ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజల సమస్యలను పవన్ కళ్యాణ్ స్వయంగా తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజలకు దగ్గరగా ఉండే పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.ప్రజల నుంచి నేరుగా వచ్చే సమస్యలు, సూచనలను స్వీకరించి వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పీఎం కిసాన్--అన్నదాత సుఖీభవ పథకం కింద కాకినాడ జిల్లాలో అర్హులైన 1,50,475 మంది రైతులకు ఆర్థిక సాయం అందజేశారు. రైతుల సంక్షేమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని పేర్కొంటూ లబ్ధిదారులకు చెక్కును అందించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.ఉప్పాడ సమీప హామీనాబాద్ ఫిషింగ్ హార్బర్ వద్ద అలల ప్రభావంతో దెబ్బతిన్న 29 పడవల యజమానులకు రూ.75.52 లక్షల పరిహారాన్ని అందజేశారు. హార్బర్‌లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు అదనంగా రూ.80 కోట్ల నిధుల మంజూరుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.అంగన్‌వాడీ వ్యవస్థను ఆధునీకరించే దిశగా కొత్తపల్లి మండలంలోని 50 అంగన్‌వాడీ కేంద్రాలను మోడల్ కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, ఇందుకు సంబంధించి అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీలు కొణిదెల నాగబాబు, కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, పిడుగు హరిప్రసాద్,ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు, కొణతల రామకృష్ణ,బత్తుల బలరామకృష్ణ,వరుపుల సత్యప్రభ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి,కౌడా చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు,మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు,వివిధ శాఖల జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు, రైతులు, మత్స్యకారులు,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.ప్రజా సమస్యలను నేరుగా విని, సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తూ నిర్వహించిన "మన ఊరు--మాట మంతి" కార్యక్రమం కాకినాడ జిల్లాలో విశేష స్పందన పొందింది.